రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ వర్తింపచేయాలి

రుణమాఫీకి నిబంధనల జీవో 567 సవరించాలి
సీపీఎం ఖేడ్ ఏరియా కమిటీ కార్యదర్శి , జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మానిక్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్
రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని సీపీఐ(ఎం) నారాయణఖేడ్ ఏరియా కమిటీ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో 567 ప్రకటించిందని, ఈ జీవోలోని నిబంధనలు అమలు చేస్తే రైతులు పెద్ద సంఖ్యలో నష్టపోతారని తెలుస్తుందన్నారు. ఎక్కువమంది రైతులకు రుణమాఫీ అమలు జరిగే విధంగా జీవోను సవరించాలని ఆయన డిమాండ్ చశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో అమలు చేస్తే ఎక్కువమంది రైతులకు అమలు కాదని రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతు రుణమాఫీ ఉండాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 567ను వెంటనే సవరించాలని, రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు..


నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
గురువారం | 18 జులై 2024 | www.navatelangana.com

వాట్సప్‌లో ఏపికె ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దు



నవతెలంగాణ -మునిపల్లి
ప్రభుత్వం చేపట్టిన రుణమాపీ నేపథ్యంలో సైబర్ నేరస్థుల చేతిలో మోసపోకుండా మీకు వాట్సప్‌లో వచ్చిన ఏపికె ఫైల్‌ను ఓపెన్ చేయకూడదని సైబర్ డీఎస్పీ నూకల వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరస్తులు ఏదో ఒక బ్యాంకు పేరిట, బ్యాంకు లోగోతో వాట్సప్‌లో ఎవరికైనా ఏపీకే ఫైల్స్ వస్తే ఆ ఫైల్‌ను ఓపెన్ చేయకూడదని, ఒకవేళ ఓపెన్ చేస్తే వాళ్ల కంట్రోల్‌కి వెళ్లిపోతుందన్నారు. అంతేకాకుండా మన కంట్రోల్‌లో ఉన్న ప్రతి ఒక్క మెసేజ్ వాళ్లకు వెళ్లిపోతుందని, దాని ద్వారా సైబర్ నేరస్తులు మన గూగుల్ పే, ఫోన్ పే ద్వారా డబ్బులు యూపీఐ ద్వారా దోచేసే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరు ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయకూడదన్నారు. ఒకవేళ మీ వాట్సప్ పని చేయకపోతే రీ ఇన్స్టాల్ చేసి రిపోర్ట్ ఆప్షన్లో రిపోర్ట్ చేయాలన్నారు. నేరానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని నూకల వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

రూ.1 లక్ష వరకు...
రైతు ఖాతాల్లో జమ



- నేడు సాయంత్రం 4 గంటలకు రైతు ఖాతాల్లో డబ్బులు
- తొలి విడత ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,52,212 మందికి
- నియోజకవర్గాల వారిగా అర్హులైన రైతుల జాబితాలు
- రూ.1 లక్ష వరకు ఉన్న పంట రుణాలన్నీ మాఫీ
- బ్యాంకర్లు, కలెక్టర్లలో సీఎం ప్రత్యేక సమావేశం
- రైతు వేదికల్లో సంబరాలకు ఏర్పాట్లు
- కుటుంబంలో ఒక్కరికేనా..? రేషన్‌కార్డు లింకు ఉండదా..?
- నేడు తేలనున్న రైతుల సందేహాలు

జిల్లా	1 లక్ష వరకు రుణమాఫీ పొందిన రైతులు
సంగారెడ్డి	51164
సిద్దిపేట	53128
మెదక్	47920
మొత్తం	152212

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
రైతు రుణమాఫీ తొలి ఘట్టం గురువారం ప్రారంభం కానుంది. రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాల్ని ఆగస్టు 15 వరకు మాఫీ చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసింది. తొలి విడతలో రూ.1 లక్ష వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తుంది. మిగతా రైతులకు రెండో దశలో మాఫీ చేయనుంది. ఆగస్టు 15 వరకు రెండో దశను కూడా పూర్తి చేస్తామంటోంది. రూ.2 లక్షలు మాత్రమే మాఫీ చేయనున్నందున అంత కంటే ఎక్కువ రుణమున్న రైతులు ముందే అట్టి సొమ్మును బ్యాంకుల్లో చెల్లిస్తే వారికి కూడా మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ మార్గదర్శకాల్లో రేషన్‌కార్డు, కుటుంబంలో ఒక్కరికే, రీ షెడ్యూల్ చేసిన రుణాలకు వర్తించబవని పేర్కొన్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వాటికి సవరణ చేస్తూ వివరణ ఇచ్చారు. అయితే జీవో రూపంలో ఆదేశాలు రాకపోవడంతో రైతుల్లో నెలకొన్ని సందేహాలు నివృతి కాలేదు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయితే కానీ..! ఎవరు అర్హులు..? ఎవరు అనర్హులు అనేది తేలనుంది.

తొలి విడతలో 152212 మందికి
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రుణమాఫీలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన 152212 మంది రైతులకు వర్తించనుంది. రూ.1 లక్ష వరకు పంట రుణాల్ని మాత్రమే ప్రభుత్వం తొలి విడతలో మాఫీ చేసి డబ్బుల్ని రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. అందులో ఎంత మంది రైతులున్నారనేది బ్యాంకర్లు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ లెక్క ప్రకారం రూ.1 లక్ష వరకు పంట రుణాలు కల్గిన రైతులు సంగారెడ్డి జిల్లాలో 51164 మంది ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 53128 మంది రైతులు, మెదక్ జిల్లాలో 47920 మంది రైతులకు తొలి విడతలో రుణం మాఫీ కానుంది. రెండో విడతలో రూ.1.50 లక్షల వరకు రుణాల్ని జులై చివరి వారంలో మూడో విడతలో రూ.2 లక్షల వరకు ఆగస్టులో మాఫీ చేయనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.2 లక్షల వరకు పంట రుణాలు పొందిన రైతుల వివరాల్ని పరిశీలిస్తే... సంగారెడ్డి జిల్లాలో 2.50 లక్షల మంది రైతులకు రూ.2505.52 కోట్ల పంట రుణాలిచ్చారు. సిద్దిపేట జిల్లాలో 209093 మంది రైతులకు రూ.2600 కోట్ల పంట రుణాలిచ్చారు. మెదక్ జిల్లాలో 148218 మంది రైతులకు రూ.828 కోట్ల పంట రుణాలిచ్చారు.

నియోజకవర్గాల వారిగా జాబితాలు
ఉమ్మడి మెదక్ జిల్లాలో తొలి విడతలో రుణమాఫీకి అర్హులైన రైతుల జాబితాల్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా తయారు చేశారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలోని వివిద బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన రైతులెంత మంది..? అందులో రూ.2 లక్షల వరకు రుణం ఉన్న వాళ్లు ఎందరు..? తొలి విడతకు అర్హులైన రూ.1 లక్ష వరకు పంట రుణం ఉన్న వాళ్లు ఎందరు అనేది జాబితా తయారు చేశారు. తొలి విడతలో రూ.1 లక్ష వరకు రుణాల్ని మాఫీ చేస్తున్నందున అందులో అర్హులైన రైతుల జాబితాలను ఆయా బ్యాంకులు తమ బ్రాంచీల వారిగా పంట రుణాలు పొందిన రైతుల పేర్లు, రుణం మొత్తం, తొలి విడతలో అర్హులైన వారి జాబితాలను గ్రామాల వారిగా తీశారు. సంగారెడ్డి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, మెదక్ జిల్లాలో రెండు, సిద్దిపేట జిల్లాలో నాలుగు నియోజకవర్గాల వారిగా రూ.1 లక్ష వరకు రుణం మాఫీ అయిన రైతుల జాబితాల్ని బుధవారమే మండలాలు, గ్రామాల వారిగా ప్రకటించారు.

సాయంత్రం 4 గంటలకు డబ్బులు జమ
రుణమాఫీ ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. తొలి దశలో రూ.1 లక్ష వరకు పంట రుణాల్ని మాఫీ చేస్తున్నందున గురువారం సాయంత్రం రైతుల రుణ ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆయా జిల్లాలకు చెందిన బ్యాంకర్లు, కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఆ సమావేశంలో రుణమాఫీలో తీసుకోవాల్సిన జాగ్రతలు, పాటించాల్సిన అంశాలు, మార్గదర్శకాల్లో చేయాల్సిన సవరణలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తర్వాత అర్హులైన రైతులకు సాయంత్రం 4 గంటలకు ఒకే సారి రుణ ఖాతాల్లో డబ్బుల్ని జమ చేస్తారు. ఆ వెనువెంటనే రైతుల సెల్‌ఫోన్లకు రుణమాఫీకి సంబంధించిన డబ్బులు ఖాతాల్లో జమ అయినట్లుగా మెసేజ్‌లు కూడా వస్తాయని అధికారులు చెబుతున్నారు.

రైతు వేదికల్లో సంబరాలు
ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణ మాఫీ చేస్తున్నందున గురువారం సాయంత్రం 3.30 గంటలకు డబ్బులు జమ చేసే ప్రక్రియను ప్రారంభిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులనుద్దేశించి ప్రసంగిస్తారు. ఇందు కోసం సంగారెడ్డి జిల్లాలో 116, మెదక్ జిల్లాలో 76, సిద్దిపేట జిల్లాలో 127 రైతు వేదికల్లో లబ్దిదారులైన రైతులు పాల్గొననున్నారు. రుణ మాఫీ సందర్భంగా రైతుల్ని సమీకరించి సంబరాలు జరిపేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా రైతు వేదికల్లో జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ్మా, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొని రుణమాఫీకి సంబంధించిన విషయాల్ని వివరించనున్నట్లు సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని తెలిపారు.

మార్గదర్శకాల సవరణపై అస్పష్టత
రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల్లో నెలకొన్ని అస్పష్టతపై అధికారిక ఉత్తర్వులేమీ జారీ కాలేదు. దీంతో చాలా మంది రైతుల్లో అపోలు తొలగలేదు. ముఖ్యంగా రేషన్‌కార్డును లింకు పెట్టినందున చాలా మంది రైతులకు మాఫీ కాదు. అలాగే ఒకే కుటుంబంలో ఒక్కరికే అనే నిబంధన వల్ల కూడా చాలా మంది అనర్హులవుతారు. రీషెడ్యూల్ రుణాలకు కూడా మాఫీ వర్తించదని చెప్పారు. ఈ మూడు విషయాల్ని సవరించాలని రైతులు, రైతు సంఘాలు, ప్రతిపక్షాలు పెత్త ఎద్దున ప్రభుత్వంపై వత్తిడి తెచ్చాయి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి నాగేశ్వర్‌రావు ఇద్దరూ కూడా స్పందిచి రేషన్‌కార్డు లేకపోయినా మాఫీ వర్తిస్తుందన్నారు. కుటుంబం లెక్క కాదు పట్టాదారు పాసుబుక్ ఆధారంగా మాఫీ వర్తిస్తుందన్నారు. రీ షెడ్యూల్ చేయబడిన రుణాల్ని కూడా మాఫీ చేస్తామన్నారు. గురువారం నిర్వహించే సమావేశంలో అధికారికంగా ఆదేశాలు జారీ చేయనున్నారు.

రైతులందరికీ మాఫీ చేయాలి
గొల్లపల్లి జయరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి
పంట రుణాలు పొందిన రైతులందరికీ మాఫీ చేయాలి. మార్గదర్శకాల్లో పెట్టిన రేషన్‌కార్డు, రీషెడ్యూల్ చేయబడిన, ఒకే కుటుంబంలో ఒక్కరే అనే నిబంధనల్ని సవరించాలి. మాటల్లో చెప్పబడినప్పటికీ అధికారికంగా ఆదేశాలు జారీ చేయాలి. రూ.1 లక్ష వరకు రుణాలున్న రైతులందరికీ పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా మాఫీని వర్తింప చేయాలి. ఏవో కొర్రీలు పెట్టి రైతుల్ని ఇబ్బంది పెట్టొద్దు.

మిగిలిపోయిన ఖాళీలలో ఎస్జిటిలకు పదోన్నతులు ఇవ్వాలి

- బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4 డీఏలు ఇవ్వాలి
- పెండింగ్ బిల్స్ వెంటనే విడుదల చేయాలి
- టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్
మిగిలిపోయిన ఖాళీలలో ఎస్జిటిలకు పదోన్నతులు ఇవ్వాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) సంగారెడ్డి జిల్లా ఆఫీసు బేరర్స్ ప్రాంతీయ సమావేశం బుధవారం నారాయణఖేడ్‌లో జిల్లా ఉపాధ్యక్షులు జే.కాశీనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు కే అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని 9 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయ పదోన్నతులు నిర్వహించడం, 6 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న బదిలీలు చేపట్టడం అభినందనీయమన్నారు. మిగిలిపోయిన ఖాళీలలో వెంటనే ఎస్జిటి ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలని, బదిలీ అయిన ఎస్జిటి ఉపాధ్యాయులను అందరిని వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. అవసరమైన మేరకు తాత్కాలిక ఉపాధ్యాయులను (విద్య వాలంటీర్లను) నియమించాలని డిమాండ్ చేశారు. బదిలీలలో స్పౌస్ వినియోగించుకున్న ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా తమ భాగస్వామికి దగ్గరి పాఠశాల కాకుండా వేరే పాఠశాలకు బదిలీ పొందిన వారికి పనిష్మెంట్ కింద వారిని ఆ ప్లేస్ మార్చి లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలలో స్పౌజ్‌కి దగ్గరగా ఉన్న పాఠశాలకు బదిలీ చేయాలన్నారు. బదిలీ ప్రక్రియలో ఎస్జిటి ఉపాధ్యాయుల వెబ్ ఆప్షన్ ఇచ్చే సందర్భంలో సమయం ఎక్కువ ఇవ్వకపోవడం, ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడం వల్ల ఉపాధ్యాయులు గందరగోళపడి తప్పిదాలు దొర్లాయన్నారు. అప్పీలు చేసుకున్న అందరికి న్యాయం చేసే విధంగా ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. జీపిఎఫ్, టిఎస్జిఎల్ఐ, ఈయల్స్ సరెండర్ తదితర బిల్స్ చాలాకాలంగా పెండింగ్లో ఉన్నవి వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిలీజ్ చేయాలని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 4 డిఏలు వెంటనే ప్రకటించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జే .కాశీనాథ్, జిల్లా కార్యదర్శిలు బి. ఏశప్ప, ఎం. నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ దౌర్జన్యాలకు పేద రైతుల ఆత్మహత్యలు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకులు
- భూ ఆక్రమణలకు అధికారులపై వత్తిళ్లు
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు





నవతెలంగాణ-ములుగు
కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తూ పేద రైతులలపై దౌర్జాన్యాలు చేస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నరని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రైతు బండి పెద్దోళ్ళ కిష్టయ్య భూ వివాదంలో ఆత్మహత్యకు పాల్పడి ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్విఎం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం రైతు కిష్టయ్యను, ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాటాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులపై విపరీతమైన అక్రమాలు దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయన్నారు. బండి పెద్దోళ కిష్టయ్య తన భూమి హద్దులు చూపించాలని సర్వే కోసం దరఖాస్తు చేస్తే అక్కడికి వచ్చిన డిఐ శ్రీనివాస్ చారి ముందు సర్వే చేసి సరిహద్దులు చూపించారన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకులు అందరి ముందే అధికారికి ఫోన్ చేసి వారిపై ఒత్తిడి తెచ్చి రెండవసారి సర్వే చేపించి, ఆ హద్దులన్నీ మార్చేసి ఆ రైతు పొలానికి దారి లేకుండా చేశారన్నారు. రైతును తీవ్ర ఇబ్బందులకు గురిచేసి రైతు నుంచి రూ.20 లక్షలు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారన్నారు. పోలీస్ స్టేషన్‌లో రైతుపై కేసు పెట్టి వేధించి భయభ్రాంతులకు గురి చేస్తే ఆందోళనకు గురైన కిష్టయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. కాంగ్రెస్ పెద్దల అండ దండలు తమకు ఉన్నాయని, మీరు ఎక్కడికి వెళ్లినా మీకు న్యాయం జరగదని చెప్పారన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన దౌర్జన్యం, విపరీత చర్యల వల్ల అధికారులపై ఒత్తిడి తెచ్చి రైతు భూమి హద్దులు మార్చడం వల్లనే కిష్టయ్య ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడామన్నారు. అడిషనల్ కలెక్టర్ స్థాయిలో విచారణ జరిపించాలని హద్దులు మార్చిన డిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా ఇలాంటి దౌర్జన్యాలు జరగకుండా ఆపాలని, పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపి రైతు భూమిని రైతుకు దక్కే విధంగా రెవెన్యూ శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనా చారి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, మాదాసు శ్రీను, నూనె కుమార్ యాదవ్, అంజిరెడ్డి, జుబేర్ పాషా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో గంజాయి బ్యాచ్ అరెస్ట్

విక్రేతతో పాటు కొనుగోలు చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.
వివరాలను వెల్లడించిన సిద్దిపేట ఏసిపి మధు

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్
ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి సిద్దిపేటలో అమ్ముతున్న వ్యక్తితో పాటు అతని వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్న యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సిద్దిపేట ఏసీబీ మధు తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన టూటౌన్ సీఐ ఉపేందర్‌తో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తక్కువ రేటుకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ రేటుకు విక్రయిస్తున్న వ్యక్తిని, గంజాయి కొనుగోలు చేస్తున్న వారిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బానోతు గణేష్ పెద్దపల్లి జిల్లా కుక్కల గూడూర్‌కు చెందిన నలిమెల వినోద్ వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సిద్దిపేట డబుల్ బెడ్ రూం కేసీఆర్ నగర్ సమీపంలో బానోతు గణేష్ గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొనుగోలు దారులు అంతగిరి అరుణ్ 910 గ్రాములు, పొన్నాల కుమార్ 500 గ్రాములు, బాదరబోయిన కర్నాకర్ 420 గ్రాములు, సిద్దరబోయిన అఖిల్ 370 గ్రాములు, నారాయణరావు పేట చందు 305 గ్రాములు, కానిగంటి గణేష్ 111 గ్రాములు, అంబాటి లక్ష్మీ నర్సింహ వద్ద 111 గ్రాములు, తాటి కొండ శ్రీమాన్ 110 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 4 కేజీల గంజాయి, 9 సెల్ ఫోన్లు, కారు, రూ.23వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయ ఏఈఓను సస్పెండ్ చేయాలి

- గొలుసు మాయం ఘటనలో ఏఈఓను విచారించాలి
- బాసరలో సస్పెండ్ అయినా తీరు మారలే
- మల్లన్న ఆలయ కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ- కొమురవెల్లి
కొమురవెల్లి మల్లన్న ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న గంగా శ్రీనివాస్ గతంలో బాసర ఆలయంలో డబ్బులు వాడుకొని అవినీతికి పాల్పడితే దేవాదాయ శాఖ అధికారులు సస్పెండ్ చేశారని తెలిపారు. పైరవీలు చేసి తిరిగి ఉద్యోగంలో చేరి కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చాడని, ఇక్కడ కూడా ఆలయ కాంట్రాక్టర్లను బెదిరిస్తూ కమిషన్లు వసూలు చేస్తున్నాడన్నారు. ఇటీవల సెలవు పెట్టకుండా విహారయాత్రలకు ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చిన అనంతరం హాజరు పుస్తకంలో విధులు నిర్వహించినట్లు సంతకాలు చేశాడని తెలిపారు. సాక్షాత్తు ఆలయ ఈవో బాలాజీ ముందే తోటి ఉద్యోగి పై భౌతిక దాడికి పాల్పడ్డాడని, మల్లన్న జాతర సమయంలో వీవీఐపీ పాసులను అమ్ముకొని పట్టుబడ్డాడని తెలిపారు. అతనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. మంగళవారం జరిగిన హుండీ లెక్కింపులో వచ్చిన బంగారు గొలుసు మాయమై చెత్త బుట్టలో దొరికిన సంఘటనలో ఏఈఓ గంగా శ్రీనివాస్ పాత్ర ఉందంటూ ఆరోపించారు. ఆయన టేబుల్ దగ్గర ఉన్న సమయంలోనే ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు ఆయనను విచారించాలని డిమాండ్ చేశారు.ఆలయంలో గంగా శ్రీనివాస్ ఇన్ని తప్పులు చేస్తు అవినీతికి పాల్పడుతున్న ఈవో బాలాజీ అతనిపై చర్యలు చేపట్టకుండా సహకరిస్తున్నాడని మండిపడ్డారు. ఇతనిపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రికి ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.వెంటనే ఇతనిపై విచారణ చేపట్టి శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, వుల్లంపల్లి సాయిలు, బక్కేల్లి బాలకిషన్, నాయకులు సార్ల యాదయ్య, కరోళ్ల ఎల్లయ్య, ఎండి గోరెమియ, శ్రవణాచారి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు

బంగారు గొలుసు ఘటనపై విచారణ చేపట్టాలి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఈవో

నవతెలంగాణ-కొమురవెల్లి
మల్లన్న ఆలయ హుండీ లెక్కింపులో వచ్చిన బంగారు గొలుసు ఘటనపై విచారణ చేపట్టి దోషులను పట్టుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆలూరి బాలాజీ బుధవారం ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆలయ ముఖ మండపంలో చేపట్టిన హుండీ లెక్కింపులలో బంగారు గొలుసు కానుక వచ్చిందని, దానిని టేబుల్‌పై ఉంచామని మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆలయ ఏఈఓ గంగా శ్రీనివాస్‌ను పరిశీలించమని చెప్పి తాను భోజనానికి వెళ్లొచ్చేసరికి బంగారు గొలుసు కనిపించకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానిక ఎస్సైకి ఫిర్యాదు చేసి చుట్టుపక్కల వెతకడంతో టేబుల్ పక్కన ఉన్న చెత్తలో ఆ బంగారు గొలుసు దొరికిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చాలని ఈ గొలుసు సుమారు రూ. 20వేల విలువ ఉంటుందని తెలిపారు. ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి గంగ శ్రీనివాస్‌పై అనుమానం ఉన్నట్లు ఈవో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదు మార్పుపై పలు అనుమానాలు
ఆలయ ఈవో బాలాజీ మొదట రాతపూర్వక ఫిర్యాదులో ఏఈఓ గంగా శ్రీనివాస్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదును తయారు చేశారు. పోలీస్ స్టేషన్లో డిటిపితో చేసిన వేరొక ఫిర్యాదును ఇచ్చి అందులో గొలుసు ఘటనకు బాధ్యుడిగా ఏఈఓ గంగా శ్రీనివాస్ పేరును ప్రస్తావించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈ ఘటనపై స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



నవ తెలంగాణ-హుస్నాబాద్ రూరల్
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ వైద్యులను గుర్తించి ఎంతో కొంత పారితోషికం ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై బుధవారం హుస్నాబాద్ మండల కేంద్రంలో ఆర్‌ఎంపీలు సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీలు మాట్లాడుతూ ఆర్‌ఎంపి వైద్యులను గత పదేండ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గుర్తించి ట్రైనింగ్ ఇచ్చారని గుర్తు చేశారు. ట్రైనింగ్ అనంతరం ఆర్‌ఎంపీలను పట్టించుకున్న ప్రభుత్వం లేదన్నారు. తెలంగాణ వస్తే మన బతుకులు మారుతాయని తెలంగాణ ఉద్యమంలో ఆర్‌ఎంపీల పాత్ర ఉందన్నారు. కానీ బీఆర్ఎస్ 10 ఏండ్లు అధికారంలో వుండి ఏ రోజు కూడా ఆర్‌ఎంపీలను గుర్తించిన పాపాన పోలేదన్నారు. నేడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి పారితోషికం ఇస్తామని ప్రకటించడం హర్షనియమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీ అధ్యక్షులు గీకురు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు సుదర్శన్, బంక చందు, ముంతాజ్, కన్నరం శీను, బింగి శ్రీనివాస్, పోతుగంటి బాలయ్య, కోడం ఆంజనేయులు, ప్రకాష్, కృష్ణ, పరశురాములు రమేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
గురువారం | 18 జులై 2024 | www.navatelangana.com

ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మనూర్

నూతనంగా నాగల్‌గిద్ద ఎస్ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డి.సాయిలును కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. స్థానిక సమస్యలపై చర్చించిన అనంతరం మండలం పరిధిలో శాంతిభద్రతలు, చట్టాలపైన ప్రజలకు అవగాహన కల్పించాలని కాంగెగ్రెస్ నాయకులు కోరారు. ఎస్ఐ సాయిలు మాట్లాడుతూ, ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎస్ఐని కలిసిన వారిలో మాణిక్ రావు పాటిల్, శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ రూపీ సింగ్, మాజీ సర్పంచ్ గుండెరావు, మాజీ ఎంపీటీసీ పండరి నాథ్, సంజీవ్ పటేల్, పూదులల్, అంజిరెడ్డి, స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-జిన్నారం

తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జెరిపాటి జైపాల్‌ను బుధవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి వడ్డే కృష్ణ, పీసీసీ ప్రతినిధి కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి బృందం ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావును కలిసిన బాల్ రెడ్డి



నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు హరీష్ రావును జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డిలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సత్కరించారు. మాజీ మంత్రిని వీరు కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు బాచుపల్లి జైపాల్ రెడ్డి, వేణుపాల్ రెడ్డి, బీరప్ప యాదవ్, పుండరీకం, సతీష్, సాయి కిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావు ప్రెస్ మీట్‌కు తరలిన నేతలు



నవతెలంగాణ జిన్నారం

పటాన్‌చెరు నియోజకవర్గంలో బుధవారం రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు నిర్వహించిన ప్రెస్‌మీట్‌కు బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. పటాన్‌చెరుకు తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఉద్యమ నాయకుడు జిన్నారం వెంకటేష్ గౌడ్, మాదారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్, సీనియర్ నేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాయి కోటి రాజేష్, యువ నేతలు ఆది రామకృష్ణ, మాదారం గణేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు పండగ సాయన్న

- భూస్వాములకు, రజాకర్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటం మర్చిపోలేనిది
- సాయన్న స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం
- నీలం మధు ముదిరాజ్



నవతెలంగాణ-పటాన్‌చెరు

నిజాంరజాకర్లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాట యోధుడు పండగ సాయన్న అని నీలం మధు ముదిరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో పండగ సాయన్న చౌరస్తాలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు ఎన్.ఎం శ్రీనివాస్ రెడ్డి, శ్రీహరి ముదిరాజు లతో కలిసి పాల్గొన్నారు. పేద ప్రజలు ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు. ఆకలితో అల్లాడుతున్న గ్రామాలలో పండగ సాయన్న అడుగు పెడితే వారి కడుపు నింపి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత వల్లే సాయన్నకు పండగ సాయన్నగా పేరు వచ్చిందన్నారు. ముదిరాజ్ కులంలో పుట్టిన ఈ మహనీయుడు బంధుక్ ఎత్తి రజాకర్ల అన్యాయాలను ఎదిరించి ఎదురొడ్డి నిలిచి బహుజనాలకు అండగా నిలిచాడని గుర్తు చేశారు. అలాంటి మహావీరుడు స్ఫూర్తితో భవిష్యత్తు తరాలు పోరాటాన్ని అలవర్చుకోవాలని నీలం మధు పిలుపునిచ్చారు.

ఊరూరా ఘనంగా మోహరం తొలి ఏకాదశి వేడుకలు



నవతెలంగాణ-చౌటకూర్

మండలంలో ఊరూరా ఘనంగా తొలి ఏకాదశి, మొహరం పండుగను ప్రజలు చేసుకున్నారు. ఆషాడ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశికి అత్యంత విశిష్టత ఉంది. ఏడాది ప్రారంభానికి సూచికగా తొలి ఏకాదశిని సూచిస్తూ పురాణాలు చెబుతున్నాయి. శ్రీ మహావిష్ణువు ఎంతో ప్రీతిపాత్రమైనదిగా కొలుస్తూ భక్తులు తమ మొక్కులను చెల్లించుకుంటున్నారు. మొహరం సందర్భంగా గ్రామాలలోని వీధుల గుండా పీర్లను ఊరేగిస్తూ ఓహెూ జంబియా ఓలంపల్లి జంబియా, అస్సైదుల హారతి కాల గజ్జల గమ్మతి అంటూ ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. హిందూ ముస్లిం సోదర భావంతో ప్రతీకగా నిలిచే పండుగ మోహరం అని పలువురు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పండగలకు గ్రామం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివారులో వాహనాల తనిఖీ



నవతెలంగాణ-కోహీర్

మండలంలోని పీచరాగడి గ్రామ శివారులో బుధవారంఎస్ఐ అరుణ్ కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు వాహనాల పత్రాలు అన్ని తమ దగ్గర ఉంచుకోవాలని వాహనదారుకు సూచించారు.

పార్వతీశ్వరాలయంలో కట్టడాలను కూల్చిన గుర్తుతెలియని వ్యక్తులు

- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



నవతెలంగాణ జోగిపేట

జోగిపేట శ్రీ పార్వతీశ్వరాలయంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి కూల్చివేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు జోగిపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పనులు పూర్తిచేసుకుని వెళ్లిన తర్వాత మరుగుదొడ్లపైన వేసిన షెడ్డు, పైపులైన్, వెంటిలేటర్లను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జోగిపేట ఎస్సై పాండు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలన చేశారు. కమిటీ సభ్యులు సత్యవ్రత్, రమేష్ అప్ప, రమేష్, రవి ప్రకాష్‌లు ఆయనకు వివరించారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వారికి హామీ ఇచ్చారు.

మానవత్వం చాటుకున్న వార్డెన్ 'రవి కృష్ణ'



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి ప్రభుత్వ హిస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వ్యక్తికి బుధవారం అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్త దానం చేసి మానవత్వం చాటుకున్నారు వార్డెన్ రవి కృష్ణ. సంగారెడ్డి ప్రభుత్వ అస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వ్యక్తికి ఓ పాజిటివ్ రక్తం అవసరం పడింది. కుటుంబ సభ్యులు సిద్దు, నగేష్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణకి ఫోన్ చేయగా ఆయన సూచన మేరకు కొండాపూర్ మండలంలో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న రవి కృష్ణకి విషయాన్ని వివరించాడు. వెంటనే రవి కృష్ణ ముందుకు వచ్చి రక్తదానం చేశాడు. 8వ సారి ఓ పాజిటివ్ రక్త దానం చేసినట్లు రవికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షులు బంగారు కృష్ణ మాట్లాడుతూ రక్త దానం ప్రాణ దానంతో సమానమన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా 3 నెలలకు ఒకసారి రక్త దానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. రక్త దాత రవి కృష్ణకు ఆర్.ఎం.ఓ. రవి కుమార్ ప్రశంసాపత్రం అందజేశారు. కుటుంబ సభ్యులు సిద్దు, నగేష్, సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

రుణమాఫీపై నేడు ముంగిలో సంబరాలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రైతులకు రుణమాఫీపై స్పష్టమైన ఆదేశాలు రావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముంగి గ్రామంలో రైతు వేదికలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రుణమాఫీ సంబరాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బసంత్ పూర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారని, పార్టీ నాయకులు కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో విచ్చేయాలని ఆయన కోరారు.

విచ్చలవిడి బ్లాస్టింగ్‌లపై నాయకుల అభ్యంతరం

- ఈ క్రషర్లు మా పాలిట మరణ శాసనాలు





నవతెలంగాణ-జిన్నారం

క్రషర్లు మా పాలిట మరణ శాసనాలుగా మారుతున్నాయని జనం గుండె ఘోషను ఎవరూ పట్టించుకోరా అంటూ ఊట్ల పంచాయతీ పరిధి గ్రామమైన దాది గూడెం పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం ఊట్ల పంచాయతీ పరిధిలో గల కంకర క్రషర్ల విచ్చలవిడి బ్లాస్టింగ్‌ల దాష్టికం పరిశీలించి పలువురు లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేశారని స్థానిక నేతలు వాపోతున్నారు. దాదిగూడెం గ్రామ సమీపంలో గల కంకర క్రషర్లతో ప్రతిరోజు సాయంత్రం బ్లాస్టింగ్‌లు నిబంధనలకు విరుద్ధంగా సహజ వనరులను కొల్లగొట్టే రీతిలో విచ్చలవిడిగా నిర్వహిస్తుండడం ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. ఫలితంగా స్థానికంగా గల ఇళ్లకు బీటలు వాడడం, విపరీతమైన దుమ్ము ధూళి ఆవహించడం, వృద్ధులు మహిళలు పిల్లలకు అనారోగ్య సమస్యలు తరచుగా చోటు చేసుకుంటుండడం, కొందరు వృద్ధులకు అయితే తీవ్రమైన వినికిడి లోపం సమస్యలు ఎదురవుతుండడంతో తాము అనేక దురవస్థలకు గురవుతున్నట్లు గ్రామస్తులు స్థానిక నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదిగూడెం పరిసర ప్రాంతాల పాలిట శాపంగా మారిన కంకర క్రషర్లపై తగిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దాది రమేష్, గంగు రాజు, కొరివి దేవేందర్, మోత కృష్ణ, ఎంకిరిగారి వెంకటేష్, నరసింహులు నల్ల మధు, వేణు ఆంజనేయులు ఎంకిరిగారి రవి, కర్రె నర్సింగరావు, బండి గిరి, గంగు సత్యనారాయణ, వడ్డేపల్లి శ్రీనివాస్, మోత నర్సింలు, శ్రీను సాయికుమార్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు

















నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలంలో బుధవారం మొహర్రం పర్వదినాన్ని ముస్లిం సోదరులు ప్రజలు ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు . పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్నారం మండల పరిధిలోని మాదారం జిన్నారం కొడకంచి జంగంపేట శివానగర్ సోలక్ పల్లి వావిలాల గడ్డపోతారం కిష్టయ్య పల్లి నల్తూర్ నర్రిగూడ లక్ష్మీపతి గూడెం తదితర ప్రాంతాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ బృందం, ఆయా ప్రాంతాలకు సంబంధించిన స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట మున్సిపాలిటీ తో పాటు ఆయా గ్రామాలలో బుధవారం పీర్ల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. జోగిపేట పట్టణంలో ఉదయం స్థానిక క్లాక్ టవర్ వద్ద మౌలాలి, దూద్ పీర్లను అలింగణం చేయించారు. ఆయా గ్రామాలలో కూడా పలు పేర్లను అలింగణం చేయించారు. దీంతో ప్రజలు హిందూ ముస్లిం అనే తేడా లేకుండా పండగను చేసుకున్నారు. జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్సై పాండుల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నవతెలంగాణ-వట్ పల్లి

మండలంలో మొహరం వేడుకలు ఘనంగా సాగాయి, ఆయా గ్రామాలలో పండుగకు రెండు రోజుల ముందుగానే మసీదుల వద్ద కులాల మతాలకతీతంగా సాయంత్రం వేళలో రాత్రి 12 గంటల వరకు ఆటపాటలతో ఉత్సవాలను తలపించేలా కాళ్లకు గజ్జలు కట్టుకొని ఒసేయ్ దుల పాటలు పాడుతూ ఉత్సాహాలను ప్రారంభించారు, మంగళవారం రాత్రి 9 గంటల నుంచి మసీదుల వద్ద పీర్లను అలంకరించి ఆటపాటలతో మజీద్ నుంచి పేర్లతో ప్రారంభమైన ఊరేగింపు గ్రామాల పురవీధుల గుండా ఆటపాటలతో బుధవారం తెల్లవారుజాము వరకుకొనసాగింది. మధ్యాహ్నం గ్రామ బహిరంగ ప్రదేశంలో డప్పుచప్పులతో ఆటపాటలు నిర్వహించి మధ్య మధ్యలో ప్రేక్షకులను ఉత్సాహపరిచేందుకు వివిధ నాటకాల ప్రదర్శించారు.

నవతెలంగాణ-న్యాల్‌కల్

మొహరం పీర్ల పండుగ వచ్చిందంటే టేకుర్ గ్రామంలో ఎంతో ఆసక్తిగా తిలకించేందుకు ప్రజల సందడి కనిపిస్తుంది జిల్లాతో పాటు నలుమూలల వేల సంఖ్యలో శుక్రవారం వరకు పీర్ల ఊరేగింపు కొనసాగుతుంది కుల మతాలకతీతంగా పవిత్రంగా టేకురు గ్రామంలో దూది పీర్లతో ఆటపాటలు ఆనవాయితీగా నిర్వహిస్తూనే వస్తారు కొండగట్టుపై మైబు సుభాని దర్గా ఎంతో పవిత్రంగా పిలవబడే దర్గా ఉందని చెప్పుకోవచ్చు టేకుర్ పీర్ల పండుగకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు జహీరాబాద్ ఎంపీ సురేష్ సెట్కార్ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ మంత్రి డా.చంద్రశేఖర్ మధ్యాహ్నం 2 గంటలకు విచ్చేస్తున్నట్లు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండలంలో రేజింతల్ , చాల్కి , డప్పుర్ , హుస్సేన్ నగర్ , చినిగేపల్లి , మామిడిగి , ఆయా గ్రామాల్లో పీర్ల పండుగ ఆటపాటలతో ఉత్సవంగా ప్రారంభమైంది.

పటిష్టమైన పోలీస్ బందోబస్తు

టెకూర్ గ్రామంలో మొహరం పండుగకు గట్టి భద్రత చర్యలు చేస్తున్నట్లు జైరాబాద్ రూరల్ సీఐ నైముద్దీన్ ఎస్సై రామునాయుడు పేర్కొన్నారు టేకురు గ్రామంలో ఎంతో విశిష్టత భక్తిశ్రద్ధలతో ప్రజలకు ఆకట్టుకునేలా మొహరం పీర్ల పండుగ నిర్వహిస్తారు. కుల మతాల అతీతంగా నిర్వహించే పండుగలకు శాంతియుతంగా నిర్వహించుకునేలా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. 3 ఎస్ఐలతో పాటు 20 మంది పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తారని రూరల్ సీఐ నైముద్దీన్ చెప్పారు.

నవతెలంగాణ-సంగారెడ్డి

మండలంలోని పోతిరెడ్డి పల్లిలో ఏర్పాటు చేసిన పీర్లను ఫోరమ్ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ, మొహరం పీర్లు, త్యాగానికి ప్రతి రూపమన్నారు. మొహరం స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ప్రజల హక్కుల కోసం అన్యాయం , నిరంకుశం పై పోరాడాలన్నారు. పోతిరెడ్డి పల్లి లో మొహరం పీర్ల పండగ ఘనంగా చేయడం అభినందనీయం అని అన్నారు. పీర్ల ఉత్సావాల్లో భాగంగా దర్శించిన వారిలో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి అమిది పురం మహేష్ కుమార్ సహా కార్యదర్శి పాండు రంగం,శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు సాయి వరాల గ్రామ నాయకులు దామోదర్ రెడ్డి, నిర్వాహకులు నర్సింలు,సిద్దయ, శ్రీను,కృష్ణ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని బర్దిపూర్, ఎల్గోయి గ్రామాలలో బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రజలు మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పీర్లను గ్రామ పురవీధులలో ఊరేగించారు. పీర్ల మసీదుల వద్ద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై పీర్ల ఊరేగింపును తిలకించారు. డప్పు చప్పుల మధ్య, ప్రజల ఆటపాటలతో గ్రామం మొత్తం మార్మోగింది.

నవతెలంగాణ-కోహీర్

మండలంలోని గోడ్యర్‌పల్లి గ్రామంలో మొహరం వేడుకలు ఘనంగా జరుపుకొని పీర్ల ఉత్సవాలు నిర్వహించి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్సీ సెల్ రాచయ జైపాల్ ఆ గమయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌లకు కౌన్సిలింగ్

- తగదాల్లో తల దూర్చరాదు
- డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి







నవతెలంగాణ జహీరాబాద్

రౌడీ షీటర్లు కుటుంబ దగాదాలు, భూతగాదాల్లో తల దూర్చరాదని, సత్ప్రవర్తనతో ఉండాలని వారి ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు డిఎస్పీ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని రౌడీ షీటర్లను జహీరాబాద్ డిఎస్పి రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు, సంగారెడ్డి ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు నేర చరిత్ర కలిగిన రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని లేకపోతే వారిపై చర్యలు తీసుకుని పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నవారు మళ్లీ ఎలాంటి తగాదాలలో కుటుంబ విషయాలలో భూతగాదాలలో తల దూర్చరాదని, మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు, ప్రజలకు ఎలాంటి భయభ్రాంతులకు గురిచేసినా, ప్రజలను హింసకు గురిచేసినా అలాంటి వారిపై తక్షణ చర్యలు తీసుకుని పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. రౌడీషీటర్‌గా పేరుందిన పలువురి ఇంటికి వెళ్లి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసులు వీరిపై నిరంతరం నిఘా పెడుతారని, ఏ చిన్న తప్పు చేసినా ఊరుకోమని, మారకపోతే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, జాగ్రత్తగా జీవించాలని కోరారు. ఈ సందర్భంలో జహీరాబాద్ సిఐ ఆర్.రవి, ఎస్సై కాశీనాథ్‌లు కూడా రౌడీ షీటర్‌లను కలిసి వారిని హెచ్చరించారు.

నవతెలంగాణ-కొండాపూర్

ఉన్నతాధికారుల సూచన మేరకు ఎస్సై హరిశంకర్ గౌడ్ మండలంలోని పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లకు పలు సూచనలు చేశారు. సత్ప్రవర్తనతో ఉండాలని ఎలాంటి తగాదాలకు గొడవలలో తల దూర్చొద్దని, భూతగాదాలు సెటిల్మెంట్ చేయొద్దని, లా అండ్ ఆర్డర్ సమస్యలు తీసుకురావద్దని సూచించారు. మంచి క్రమశిక్షణతో కలిగి ఉండాలని భవిష్యత్తులో మంచి ప్రవర్తన కలిగిన వ్యక్తులపై రౌడీ షీటర్లను తొలగించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోహీర్

మండలంలోని పిచరాగడి , బడంపేట తదితర గ్రామాల్లో ఉన్న పాత నేరస్తులకు ఎస్ఐ అరుణ్‌కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని హెచ్చరించాడు, లేని పక్షంలో కొత్త చట్టాల ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అట్టహాసంగా మంజీరా రోటరీ క్లబ్ సంస్థాపన వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి: విద్యానగర్ కమిటీ హాల్లో సంగారెడ్డి 23వ సంస్థాపన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, గౌరవ అతిథులుగా రొటేరియన్ రమణా దేవరకొండ అసిస్టెంట్ గవర్నర్, సంగారెడ్డి జిల్లా రోటరీ పాస్ట్ ప్రెసిడెంట్ కె.దినేష్ లు హాజరయ్యారు. నూతనంగా ఎన్నుకోబడ్డ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపన్నగారి చంద్రశేఖర్, నక్క రమేష్ కోశాధికారి ఇతర బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను రొటేరియన్ రమణ దేవరకొండ, రొటేరియన్ దినేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విచ్చేసిన గౌరవ రమణ దేవరకొండ మాట్లాడుతూ అనేక హెల్త్ క్యాంపులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, కరోనా సమయంలో ఉచిత సరుకులు పంపిణీ, తదితర సంక్షేమ కార్యక్రమాలను రోటరీ క్లబ్ నిర్వహిస్తుందని కొనియాడారు. ముస్ముందు ఇదే ఉత్సాహంతో నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సహాయ సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి జిల్లా రోటరీ సభ్యులు పూసల లింగాగౌడ్, అడ్వకేట్ అంజయ్య, సిద్దన్న, దినేష్, పాండురంగం, భూమయ్య, నాగిరెడ్డి, ఏ. కిషన్, డాక్టర్ రాజు గౌడ్ డాక్టర్ సంపత్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ ప్రభాకర్, కమలాకర్, చందర్, శ్రీకాంత్, కౌన్సిలర్ నాగరాజు, నక్క నాగరాజుగౌడ్, పెంటోజీ, మాజీ మండల విద్యాధికారి అంజయ్య, సత్యనారాయణ చవాన్, దశరథ్, శ్రీనివాస్, ప్రభాకర్ మరియు హైదరాబాదులోని వివిధ రోటరీ క్లబ్బుల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జనార్దన్ రెడ్డి,చైతన్య, రాజేష్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు.

ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ



నవ తెలంగాణ- మెదక్ టౌన్

మెదక్ డిపోలో ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మెదక్ డీఎస్పీ రాజేష్, మెదక్ డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్ రవీందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఉద్యోగులకు అందరికీ తగు సూచనలు చేశారు. అదే విధంగా డ్రైవింగ్ మెలకువల గురించి ఫారెస్ట్‌లో ప్రయాణం చేస్తున్నప్పుడు డ్రైవర్లు పాటించవలసిన నియమాల గురించి తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లకు, కండక్టర్లకు, సూపర్వైజర్లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ -పాపన్నపేట

పాపన్నపేట మండలం బాచారం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ బుధవారం పరామర్శించారు. మృతి చెందిన కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున మొత్తం రూ. లక్ష అందజేశారు. అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కర్రోల్ల విఠల్ కుటుంభానికి రూ.10 వేల ఆర్థికసహాయం అందజేశారు. ఈ కార్యక్రమం మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



నవ తెలంగాణ- రాయపోల్

బుధవారం దౌల్తాబాద్ మండలంలో సేవలందిస్తున్న ప్రభుత్వ 108 అంబులెన్స్‌ను 108 అంబులెన్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు.అత్యవసర సమయంలో ప్రమాదాలలో ఆస్పత్రులకు చేర్చి మనుషుల ప్రాణాలు రక్షించడంలో 108 అంబులెన్స్‌ల ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలు జరిగిన అత్యవసర పరిస్థితులలో సత్వరమే ఆసుపత్రికి వెళ్లడానికి 108 వాహనం ఎంతో ఉపయోగపడుతుందని, అలాంటి వాహనం ద్వారా ఎంతో మంది ప్రాణాలను రక్షించగలుగుతున్నాం. 108 వాహనం సేవలు ఉచితంగానే ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ 108 అంబులెన్స్‌లో గల అత్యవసర మందులు, అత్యవసర పరికరాలను, ఆక్సిజన్ పలు రికార్డులను పరిశీలించామన్నారు. దౌల్తాబాద్ 108 సిబ్బంది అందిస్తున్న సేవలపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో వుండి వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ వెంకటేష్, 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ భాను, పైలెట్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి డీసీఎం వ్యాన్ బోల్తా



నవ తెలంగాణ - కొండపాక

కొండపాక మండలం దుద్దెడ మూలమలుపు వద్ద రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డీసీఎం వ్యాన్ బుధవారం బోల్తా పడింది. సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల నుంచి తాండూరుకు బియ్యం లోడుతో వెళ్తున్నప్పుడు దారిలో బోల్తా పడింది. దాంతో డ్రైవర్, క్లీనర్లకు గాయాలయ్యాయి. వీరిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. కాగా అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంగా భావిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులను వివరణ కోరగా పూర్తి ఆధారాల లభించలేదని విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు



నవ తెలంగాణ - సిద్దిపేట

జులై 18 నుంచి 28 వరకు జరగనున్న 4వ విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్క జనసేన నాయకుడు, జనసైనికుడు, వీర మహిళ భాద్యతగా పాల్గొనాలని జనసేన పార్టీ నాయకులు మురాకర్ సాయి కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొత్త సభ్యత్వ నమోదుతో పాటు, సభ్యత్వ రెన్యువల్ కార్యక్రమం జరిగేలా చూడాలని అన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో గొడుగు శివకుమార్, గజ్జె అశోక్, బట్టు కృష్ణ పాల్గొన్నారు.

రైతు పక్ష పాతి సీఎం రేవంత్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్న ముఖ్యమంత్రి రైతు పక్ష పాతి అని, తెలంగాణ రైతులకు రుణ మాఫీ వచ్చే పంద్రాగస్టు లోపే పూర్తి చేస్తామని దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుదవారం ప్రజాభవన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంఛార్జిలు, జిల్లా అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్‌లతో సీఎం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పత్రిక ప్రకటన ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి గా అమలు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. దానిలో భాగంగానే రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ మేరకు బుధవారం నుంచి లక్ష వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తున్నామన్నా రు. గురువారం నియోజకవర్గ కేంద్రంలో మొదటగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం కాంగ్రెస్ శ్రేణులు, రైతులతో బైక్ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. రెండో రోజు మండల కేంద్రాల్లో, మూడో రోజు గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీలు చేసి రైతులకు చేస్తున్న రుణమాఫీ పై కాంగ్రెస్ నాయకులతో, కార్యకర్తలతో అవగాహన పేర్కొన్నారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ దేశ చరిత్రలో గొప్ప పథకంగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగుతుందని కొనియాడారు. దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో వుండి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గురువారం నియోజక వర్గంలో జరిగే బైక్ ర్యాలీ కి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతువేదికలలో ఋణ మాఫీ సంబరాలు



నవతెలంగాణ -గజ్వేల్

గురువారం రైతు వేదికల వద్ద రైతు రుణమాఫీ పంపిణీ సంబరాలు నిర్వహిస్తామని గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీ సంబరాలు నిర్వహించుకోవాలని ఆయన కోరారు. గజ్వేల్ వ్యవసాయ సబ్ డివిజన్లో గజ్వేల్, కొండపాక, రాయపోల్ మండలాల రైతులు రైతు వేదికల వద్ద సంబరాలకు హాజరు కావాలని కోరారు. గజ్వేల్ మండలంలో రూ.లక్ష లోపు మొదటి విడత రైతులు 3,826 ఉండగా, కొండపాక 2,932 ఉండగా, రాయపోలు 2,351 రైతులకు రుణమాఫీ జరుగుతుందని చెప్పారు. గజ్వేల్ వ్యవసాయ సబ్ డివిజన్లో మొదటి విడతగా రూ.లక్షలోపు 8,109 మంది రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఋణ మాఫీ సంబరాలు జరుపనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండీ.అఫ్రోజ్ బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి లక్ష లోపు ఋణ మాఫీ కార్యక్రమం మొదలౌతుందని, ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంచనంగా ప్రారంభిస్తారని తెలిపారు.మండలంలో 1816 మంది రైతులకు లక్ష లోపు ఋణ మాఫీ కానుందని తెలిపారు. రైతు వేదికలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని పాలమాకుల రైతు వేదికలో రైతు పంట రుణమాఫీ పై గురువారం రైతులతో కలిసి సంబరాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి గీత తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రతిష్ట పరచడానికి, వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు సంక్షేమాన్ని మెరుగుపరచడానికి, పంట రుణాల మాఫీని ఒక అత్యవసర పెట్టుబడిగా గుర్తించిందని తెలిపారు.పంట రుణమాఫీ రైతులపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించి వారు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీ పై కొత్త రుణాలు తీసుకోవడానికి ఉపయోగ పడుతుంది అని చెప్పారు. అధిక వడ్డీ పై బయట రుణాలు తీసుకోకుండా ఉపయోగపడుతుందన్నారు. మండలంలో 2284 రైతులగాను రూ.లక్ష వరకు పంట రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని చెప్పారు. మండలంలోని రైతులందరూ పాలమాకుల రైతు వేదికలలో జరిగే పంట రుణమాఫీ సంబరాలకు హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయులు చూపిన ఆప్యాయత గురు శిష్యుల బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది

నవతెలంగాణ - మునిపల్లి

సమాజంలో తల్లిదండ్రుల తర్వాత పిల్లలు సాధారణంగా ఎక్కువగా గడిపేది పాఠశాలలోనే, అది ఉపాధ్యాయులతోనే . పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఏర్పడే వాత్సల్యం అనుబంధం వర్ణించలేనిది విద్యార్థులు పట్ల ఉపాధ్యాయులు చూపిన చొరవ, ప్రేమ ఆప్యాయత గురు శిష్యుల బంధాన్ని మరింత బలోపితం చేస్తుంది. ఇటీవల జరిగిన బదిలీల్లో తమ ఉపాధ్యాయులు బదిలీ అయినప్పుడు విద్యార్థుల్లో కనిపించిన బాధ, భావోద్వేకం ఉపాధ్యాయులు పిల్లల మధ్య బంధాలను గుర్తు చేసింది. ఎవరైతే పిల్లలతో మమేకమై వారిలో ఒకరిగా మెలిగారో వారు బదిలీ అయినప్పుడు విద్యార్థుల్లో కనిపించిన బాధ, ప్రేమ కన్నీళ్లను తెప్పించింది. కొందరు ఉపాధ్యాయులు పాఠశాలలో అభివృద్ధి కోసం చేసిన కృషి, విద్యార్థులతో మెలిగిన సానిహిత్యం బదిలీ సమయంలో భావోద్వేగాలను తెప్పించింది. మునిపల్లి మండలంలో ఇటీవల జరిగిన బదిలీలో మండలంలోని ఆయా పాఠశాలల్లో అభివృద్ధికి విద్యార్థులు విద్యా ప్రమాణాల పెరుగుదలకు కృషి చేసిన ఉపాధ్యాయులు ఎందరో ఉన్నారు. కొందరు పాఠశాలలో భౌతిక వనరులను సమకూర్చేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకొని, సొంత నిధులు వెచ్చించి భౌతిక వసతులు సమర్పించారు. కొందరైతే నవోదయ వివిధ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు తమ వంతు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆదర్శంగా నిలిచారు.





సదాశివపేట పట్టణానికి చెందిన సుధా మల్లేశం లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ బదిలీలో రాయికోడు మండలంలోని సింగీతం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో మల్లేశం 8 ఏళ్ల కాలంలో ఎంతోమందిని ఆయా గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండాగణితశాస్త్రం తరపున మండలంలో రిసోర్స్ పర్సన్‌గా సేవలందించి ప్రతి ఏటా ఉపాధ్యాయులకు గణిత బోధనలో మెలకువలను అందించేవారు. ఎప్పటికప్పుడు ప్రతి కాంప్లెక్స్ సమావేశంలో, మానిటరింగ్ టీం వెంట వెళ్ళినప్పుడు ఉపాధ్యాయులు గణిత బోధనలు తీసుకోవాల్సిన మెలకువలను ఉపాధ్యాయులకు వివరించేవారు.



మండలంలోని మేళసంఘం గ్రామానికి చెందిన తెలుగు యాదగిరి 2013 సంవత్సరంలో మండలం యందలి లోనికలాన్ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు. బదిలీపై రాగానే అప్పట్లో పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చి దిద్దడం, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం, పాఠశాలను ఆకర్షణీయంగా తయారు చేయడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉన్నప్పటికీ పరిసర గ్రామాలైన మక్తక్యాసారం చీలపల్లి, కల్లపల్లి, బేలూరు గ్రామాల నుంచి ప్రాథమిక విద్యను చదివేందుకు లోనికలాన్ పాఠశాలకు వచ్చేవారు. ఇందుకుగాను అప్పట్లో లోనికలాన్ ప్రాథమిక పాఠశాలకు ఉత్తమ పాఠశాల అవార్డు దక్కింది. పాఠశాల నుంచి నవోదయ, ఇతర గురుకుల పాఠశాలలకు అనేక మందిని ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రొద్బలంతో గురుకుల పాఠశాలకు ఎంపికైన ఒక విద్యార్థిని ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ద్వితీయ ఏడాది ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించడం గమనార్హం. అదేవిధంగా విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపులో భాగంగా ఉపాధ్యాయుడు యాదగిరిని గత ఏడాది లింగంపల్లి పాఠశాలకు సర్దుబాటు చేయగా అక్కడ ఏడాది కాలంలోనే ప్రధానోపాధ్యాయుడు అమినొద్దీన్ సహకారంతో లింగంపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి 21 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 19 మందిని ఆయా గురుకుల పాఠశాలలకు ఎంపిక అయ్యేందుకు విశేష కృషి చేశారు.



సదాశివపేట మండలం ఆరూరు గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రమౌళి 2012లో మల్లికార్జునపల్లి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడిగా నూతనంగా నియామకమై నప్పటినుంచి మల్లికార్జునపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధిలో ఎనలేని కృషి చేశారు. విద్యా ప్రమాణాల పెరుగుదలే కాకుండా పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణతో కలిసి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలను, దాతల సహకారంతో పాఠశాలలో భౌతిక వసతులు సమకూర్చడంలో ఆదర్శంగా నిలిచారు. విద్యార్థులకు పుస్తకాలు, కంప్యూటర్లు, బెంచీలు, క్రీడా సామాగ్రి సమకూర్చడంలో చంద్రమౌళి సహకారం ఎనలేనిది. తన కుమార్తెను సైతం తాను బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచి ప్రతి ఏటా ఆమె పుట్టినరోజును పాఠశాలలో చేస్తూ విద్యార్థులకు పుస్తకాలు పలకలు, పెన్నులు వంటి రాత సామాగ్రిని అందించేవారు. అదేవిధంగా తన తండ్రి జ్ఞాపకార్థం కూడా పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, నీటి సీసాలను విద్యార్థులకు అందించారు. బదిలీ అనంతరం కూడా పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుతో కలిసి సొంత నిధులతో స్మార్ట్ టీవీని బహుకరించారు. ఒక సంఘం ప్రతినిధిగా కూడా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి పాఠశాలలకు మండల వనరుల కేంద్రానికి వారధిగా నిలిచి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.



సంగారెడ్డి పట్టణానికి చెందిన ఖమ్రుద్దీన్ మండలంలోని ఖమ్మంపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పాఠశాల అభివృద్ధిలో ఎనలేని కృషి చేశారు. పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలో గ్రామస్తులను మమేకం చేస్తూ గ్రామ ప్రజల తలలో నాలుకలా నిలిచారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని బలోపితం చేయడంలో ఖమ్రుద్దీన్ ఆదర్శప్రాయుడని చెప్పవచ్చు. వైజ్ఞానిక ప్రదర్శనలో కూడా రాష్ట్రస్థాయి గుర్తింపు రావడంలో ప్రధానోపాధ్యాయులు ఖమ్రుద్దీన్ కృషి ఎనలేనిది. ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో కంది మండలానికి బదిలీపై వెళ్లారు. ఇటీవల జరిగిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థుల యొక్క ప్రేమ అభిమానాలు వీడ్కోలు సమావేశంలో అందరినీ కంటతడి పెట్టించింది. ఉపాధ్యాయుడు ఖంరోద్దీన్ సైతం భావోద్వేగానికి గురయ్యారు.

రైతుల ఖాతాల్లోకి రుణమాఫీ డబ్బులు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుడ్డ భాగ్యరాజ్



నవతెలంగాణ - తూప్రాన్

తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారంగా ఎలక్షన్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకునే ప్రకారంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని ఒకే విడతలో చేసి రైతుల ఖాతాల్లోకి డబ్బులను వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుడ్డ భాగ్యరాజ్ ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. రుణమాఫీకి అర్హులైన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఒక యూనిట్ గా పరిగణిస్తుందన్నారు. అర్హులైన రైతులకు ఒకే దఫాలో రూ.2 లక్షలను మాఫీ చేస్తుందని, నేరుగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయబడుతుందన్నారు. ఈ విషయంలో రైతులకు, రాజకీయ ప్రతిపక్ష నాయకులకు ఎలాంటి అపోహలు, అనుమానాలు అవసరం లేదన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగానే డేటా బేస్ కోసం మాత్రమే ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డులను వినియోగిస్తున్నారు. రేషన్ కార్డుల డేటా బేస్ ఆధారంగా ఒక రైతు కుటుంబంలో ఒకటి కంటే అంతకుమించి ఎక్కువ లోన్లు తీసుకున్న వారిని అర్హులైన రైతులను గుర్తించడానికి మాత్రమే బ్యాంకులో తుది జాబితా ప్రకారం పరిశీలన చేసి రుణమాఫీకి అర్హులైన రైతులుగా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపారు. రుణమాఫీ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షులు కిష్టారెడ్డి, తూప్రాన్ మండల బీసీ సెల్ అధ్యక్షులు సత్యనారాయణ, తూప్రాన్ మండల ఆర్ఎంపీ అండ్ పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అప్సర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గరిగే నర్సింగరావు, జక్కన్న గారి దామోదర్ రెడ్డి, నర్సంపల్లిజింక మల్లేశం, లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం



నవ తెలంగాణ- నిజాంపేట

నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామంలో స్వయంభుగా వెలిసిన తిరుమల స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని శ్రీ భూదేవి, శ్రీదేవి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం అర్చకులు అరుణ్ శర్మ, వెంకట్ రామ్మోహన శర్మ సంతోష్ శర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కొనసాగింది. కళ్యాణంకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్వామి వారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలకు లోటు లేకుండా చూడాలని భక్తులు స్వామివారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలనాథ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అక్క పల్లి రామిరెడ్డి, డైరెక్టర్ బాజ రామచంద్రం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెప్పెట ముత్యంరెడ్డి, చట్లపల్లి ఎల్ల గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బిల్డర్ పన్యాల వెంకటరెడ్డి 37వ జన్మదిన వేడుకలను మండల నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండే వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నార్లాపూర్ తాజా మాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి, పంజా మహేందర్, నసీరుద్దిన్, సామల మహేష్, మావురం రాజు, రెడ్డి శెట్టి రవీందర్, రాజిరెడ్డి, భూమాగౌడ్, నగేష్, ప్రశాంత్ గౌడ్, చంద్రకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



నవతెలంగాణ- పెద్ద శంకరంపేట్

తొలి ఏకాదశి పురస్కరించుకొని బుధవారం పెద్ద శంకరంపేటలోని విఠలేశ్వర స్వామి దేవాలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయం తదితర ఆలయాలలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా చేసుకొన్నారు. విట్టలేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం నుంచి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారులతో రుక్మిణి విఠలేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా చేసుకొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

నవతెలంగాణ-చేర్యాల

హిందువుల తొలి పండుగ ఏకాదశి వేడుకలను చేర్యాల పట్టణ కేంద్రంతోపాటు మండలంలో భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు సమీప ఆలయాలకు వేకువ జాము నుంచే చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి.పలువురు భక్తులు ఉపవాస దీక్ష చేపట్టారు.ఆలయాల అర్చకులు పండుగ విశిష్టతను భక్తులకు వివరించారు.

పీర్ల మసీదు నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ విరాళం



నవతెలంగాణ-చేర్యాల: మొహరం పండుగ సందర్భంగా చేర్యాల మండల పరిధిలోని బుధవారం వీరన్న పేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పీర్ల మసీదుకు ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ ఎలికట్టె శివ శంకర్ గౌడ్ రూ.10 వేల 116 లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బుడిగె శ్రీనివాస్, బొడిగం సాయి, ఎండి. అన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



నవతెలంగాణ - నార్సింగి

ఇస్లాం కాలెండర్‌లోని మొహర్రం నెల పదవ తారీఖు (యౌమే ఆషుర) సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో పీరీల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో వివిధ అషుర్ ఖానాలలో ఏర్పాటు చేసిన బీ ఫాతిమా, బడే నాల్ సాబ్, చోటే నాల్ సాబ్, ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్, ఇమామ్ ఖాసిం పీరీలను డప్పు చప్పుళ్లతో మండల కేంద్ర పరిసర గ్రామాలలో ఊరేగించిన అనంతరం మండల కేంద్రంలో ఊరేగించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. మత సామరస్యానికి, మన తెలంగాణ "గంగా జమునా" సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగను మతాల భేదం లేకుండా హిందూ, ముస్లింలు ఏకమై ఘనంగా చేసుకొన్నారు. భక్తులు పీరీలకు ప్రత్యేక ప్రార్ధనలు, మొక్కులు మొక్కిన వారు తమ కోరికలు, సమస్యలు తీరిన వారు మొక్కులను చెల్లించారు. మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ సిబ్బందితో పాటు పీరిలకు ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఊదు, బెల్లం, కుడికెలు సమర్పించుకున్నారు. ఈ వేడుకలలో ముఖ్య నిర్వాహకులైన ముర్తుజా, బాబా, మూసా, లాయఖ్, బాఖర్, ముజీబ్, మొయిన్, ముంతాజ్, ఇంతియాజ్, ఇర్ఫాన్, హబీబ్, సాదక్, అఫ్సర్, జావీద్‌లతో పాటు జామియా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు చాంద్ ఖురేషి, మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖాదర్, రబ్బానీ, ఫరీద్, జమీర్, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముహర్రం వేడుకలు ముగిసిన అనంతరం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, వేడుకలు సజావుగా నిర్వహించడానికి సహకారం అందించిన మండల ప్రజలకు నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ- మెదక్ రూరల్



మండలంలోని పేరూరు, మంభోజీ పల్లి, చిట్యాల, మొదలగు అన్ని గ్రామాల్లో పీర్ల పండుగ ఘనంగా జరిగింది. గ్రామ పురవీధుల గుండా కులాలకు, మతలకు అతీతంగా యువతీ యువకులు, అసైదుల పాటలతో కైకట్టి పీర్లను ఎత్తుకొని దూల ఆడినారు

నవతెలంగాణ - చేగుంట




ఉమ్మడి చేగుంట మండలంలోని పోతాన్ పల్లి గ్రామంలో బుధవారం ఘనంగా పీర్ల పండుగను నిర్వహించారు.మహమ్మద్ ప్రవక్త అధర్మాన్ని, అన్యాయాన్ని వ్యతిరేకించి, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ప్రశాంతంగా జీవనం కొనసాగించాలని మండల కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ అలీ అన్నారు. మొహర్రం మాసంలో మొహర్రం పండుగను 10 రోజులపాటు జరుపుకుంటారని, పదో రోజున పీర్ల దేవుళ్లను గ్రామం మొత్తం ఊరేగిస్తారన్నారు.అంతకుముందు రాత్రి అగ్ని గుండంలో దూకడం, అగ్గిలో నడవడం వంటివి చేస్తారన్నారు. పంజా పీర్ల దేవుళ్ళ ప్రతిమలను ఊరేగించి, తమ సంతాపంగా ప్రకటిస్తారని తెలిపారు. ముస్లింలు రంజాన్, బక్రీద్ తర్వాత జరుపుకునే అతి ముఖ్యమైన పండుగలో మొహర్రం పండుగ ఒకటన్నారు.పోతాన్ పల్లి పీర్లను పోతాన్ పల్లి గ్రామంతో పాటు కసాన్ పల్లి, చందాయిపేట తదితర గ్రామాల్లో ఊరేగింపుగా బయలుదేరి తిరిగి మళ్లీ పోతాన్ పల్లికి రావడం జరిగిందన్నారు.పీర్ల ఊరేగింపు కార్యక్రమంలో మూడు గ్రామాల ప్రజలు ఎంతో సంతోషంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. పీర్ల మజీద్ వద్ద అన్నదాన కార్యక్రమం చేశామన్నారు.ఈ పండుగలో మండల కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ అలీ,పెద్దలు మహమూబ్ అలీ, జావేద్ అలీ, రఫీక్ అహ్మద్, అన్వర్, అహ్మద్, ఆరిఫ్, సద్దాం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ- పెద్ద శంకరంపేట్



పెద్ద శంకరంపేట తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రజలు బుధవారం మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. పెద్ద శంకరంపేటలో భాజా భజంత్రీలతో లాల్ సాబ్ చాన్ సాబ్ దూద్ పీర్ మౌలాలి గుంటం పీర్లను పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం పాత గ్రామపంచాయతీ వద్ద పిర్లను ఉంచి అధిక సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొని పండుగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఎలాంటి అల్లర్లు జరగ కుండా పోలీసులు పర్యవేక్షించారు. ప్రజలు పిర్లకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

నవతెలంగాణ -వెల్దుర్తి



హిందూ ముస్లింలు కలిసి చేసుకొనే మొహర్రం పండుగ త్యాగానికి ప్రతికగా ప్రతి ఏటా నిర్వహించే పండుగ. మంగళవారం మండల పరిధి మంగలపర్తి గ్రామంలో పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. హసేన్ హుస్సేన్ త్యాగాలకు ప్రత్యేకంగా ఈ పండుగను 9 రోజులపాటు పీర్లను స్థాపించి పదో రోజు హిందూ, ముస్లిం కలిసి అసైదుల అంటూ డప్పుల మధ్య కోలాటాల మధ్య చెరువులో నిమజ్జనం చేశారు. ఎంతో మంది పీర్ల ముందు చిన్న పెద్ద తేడా లేకుండా ఊదుతో పీర్లకు అభిషేకాలు,ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా జస్వంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- గజ్వేల్

బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు మాదాటి జస్వంత్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఆయన నివాసంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్, బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టేకులపల్లి రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, రామచంద్ర రెడ్డి, నరసింహారెడ్డి, ములుగు రామ్ రెడ్డి, హైదర్ ఇక్బాల్, లక్ష్మీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన హైకోర్టు న్యాయవాదికి ఘన సన్మానం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల ప్రాంతం నుంచి ఇటీవల తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన అనంతుల రవీందర్ ను బుధవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని దుర్గా మాత ఆలయంలో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుర్మ వెంకట్ రెడ్డి, పాల లక్ష్మి నారాయణ, యాట యాదగిరి, అంకుగారి శ్రీధర్ రెడ్డి, ఆడెపు చంద్రయ్య, పచ్చి మడ్ల వెంకటయ్య, అవుశెర్ల యాదయ్య ముస్త్యాల బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీ నూతన బ్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-బెజ్జంకి

బెజ్జంకి మండల కేంద్రంలో కేడీసీసీ నూతన బ్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కేడీసీసీ పాలక వర్గం సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు.అంతకుముందు ఎమ్మెల్యేకూ కేడీసీసీ పాలక వర్గం సభ్యులు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. కేడీసీసీ చైర్మెన్ తన్నీరు శరత్ రావు, పాలక వర్గం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ముక్కీస రత్నాకర్ రెడ్డి, ఒగ్గు దామోదర్, లింగాల శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈఓ వాసు, సిబ్బంది బుచ్చయ్య, మల్లేశం, అనిల్, తదితర కాంగ్రెస్ నాయకుల ముఖ్యకార్యకర్తలు హాజరయ్యారు.

ప్రజలను ఆకర్షిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు



నవ తెలంగాణ- గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయని మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు బుధవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమల్లో చిత్తశుద్ధి లేకపోయేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కడిగా అమలు చేస్తున్నారన్నారు. రుణమాఫీ, మహిళల ఉచిత బస్సు ప్రయాణం, విద్యుత్ 200 యూనిట్లు, రూ.500 రూపాయలకు గ్యాస్ పంపిణీ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని అన్నారు. అదేవిధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో కేవలం ఒకే కుటుంబానికి సంక్షేమ పథకాలు పదవులు అందినట్లు విమర్శించారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి అందరిని గుర్తిస్తుందన్నారు.

గరిపెల్లికి పెందం జాతీయ పురస్కారం



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట నివాసి, ప్రముఖ బాల సాహితీవేత్త తెలుగు రాష్ట్రాల్లో కార్యశాల సంస్కృతి విస్తరించేలా నిరంతరం కృషి చేస్తున్న గరిపెల్లి అశోక్ ప్రముఖ బాలసాహితివేత్త పెందం జగదీశ్వర్ పేరుతో ప్రధానం చేస్తున్న జాతీయ బాల సాహిత్య పురస్కారం ను ఈరోజు నల్లగొండలోని నాగార్జున కళాశాలలో అందుకున్నారు. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన సభలో జాతీయ సినీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎం.పురుషోత్తం చార్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారం ప్రదానం చేశారు.ఈ పురస్కారం కింద రూ.5వేలు నగదు, ప్రశంసా పత్రము అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బాల సాహితీవేత్తలు మేరెడ్డి యాదిగిరి రెడ్డి, డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు, వుప్పల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ



నవతెలంగాణ -జగదేవ్‌పూర్

ప్రజలకు మాట ఇచ్చి మాట నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ అని జగదేవపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు కాంగ్రెస్ పార్టీ రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తుంది. దీనివల్ల కొన్ని లక్షల రైతు కుటుంబాలకి మేలు జరుగుతోందీ అని బుధవారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంటే రైతు పక్షపాతి అని ఇలాగే త్వరలో ఇందిరమ్మ ఇల్లు కూడా లబ్ధిదారులకు అందుతాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడయినా పేదల పక్షం అన్నారు. రైతు రుణమాఫీ చేస్తునందుకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షాన ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

మొహర్రం పండుగ కోసం విరాళం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామంలో ముగుస్తున్న మొహర్రం (పీర్ల పండుగ) కోసం గ్రామ మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి రూ.4 వేలు విరాళం అందించారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ పండుగను ప్రశాంతంగా జరుపుకున్న హిందూ, ముస్లింలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతో పాటు పీర్ల పండుగ కమిటీ అధ్యక్షులు, కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన పడకంటి సరోజన ఇటివలే మృతి చెందింది. ఆమె కుటుంబం నిరుపేద కుటుంబం ఈ పరిస్థితి తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన రాగుల మల్లేష్ కురుమ వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కరెడ్ల లక్ష్మారెడ్డి, అల్లూరి విజయ్ రెడ్డి, రొడ్డ రవీందర్ రెడ్డి, మల్లేశ్ యాదవ్, కరుణాకర్ రెడ్డి, రఘుపతి (లడ్డు), లడ్డు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ -గజ్వేల్

బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకొని, భరోసా కల్పిస్తామని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం గ్రామంలో శౌర్య వృత్తి చేస్తున్న యాదగిరి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరి మృతి బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు గుండె ధైర్యంతో ఉండాలని సూచించారు. తగిన ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి సాయం వచ్చే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, గజ్వేల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పత్తి మల్లారెడ్డి, నాయకపు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నేరెళ్ళ శారధకు ఓరుగంటి అభినందనలు



నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన నేరెళ్ళ శారధను హైదరాబాద్ యందు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపినట్టు రాష్ట్ర ఆహార భద్రత మండలి సభ్యుడు ఓరుగంటి ఆనంద్ బుధవారం తెలిపారు.రాష్ట్రంలో మహిళల హక్కులు, రక్షణకు పెద్దపీట వేయాలని సూచించినట్లు ఓరుగంటి ఆనంద్ తెలిపారు.

నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం



నవతెలంగాణ - కొమురవెల్లి

కొమురవెల్లి మండల కేంద్రంలోని నూతన పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్ఐ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఎస్ఐ ప్రత్యేక పూజలు నిర్వహించి తన సీట్లో ఆసీనులయ్యారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామ్మూర్తి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలపై నేతల నజర్

- కనిపించని కంచెలు, బోర్డులు
- నిర్లక్ష్య వైకరిలో అధికారులు
- రెవెన్యూ అధికారులు పట్టించుకుంటే బెట్టర్



నవతెలంగాణ- గజ్వేల్

నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్ పట్టణంలో ప్రభుత్వ స్థలాలపై ఖద్దరు చొక్కాల(నేతల) నజరు పడింది. గజ్వేల్ పట్టణంలో ప్రభుత్వ భూములు విలువైన చోట్ల ఉండటంతో వాటికి సరియైన ప్రహరీ లేకపోవడం వల్ల చాలా చోట్ల ఇప్పటికే రేకుల షెడ్లు వేసి కొందరు కబ్జా చేశారు. మరికొందరు రోడ్డుకు ఇరువైపులా భూములను మింగేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సుమారు 25 చోట్ల ప్రభుత్వ భూములు ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందిస్తే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు. రాజకీయ నాయకులు వాటిపై దృష్టి సాధించినట్టు సోషల్ మీడియాలో జోరు అందుకుంది. కంచెలు, బోర్డులు లేనిచోట్ల కబ్జాలకు అనువుగా మారుతుంది. అంతేకాదు ఐదు దశాబ్దాల క్రితం నుంచి ఉన్న ప్రభుత్వ భూమి గత ప్రభుత్వంలో అమాంతంగా కబ్జాకు గురైంది. అధికారులు చూసి చూడనట్టు వివరించడంతో రికార్డులు తారుమారు చేశారు. చివరకు తమ భూమి అని ప్రభుత్వ భూమిని మార్చుకున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డమైన పనులు చేసేవారికి అడ్డు అదుపు ఉండదు. ముందుగానే రెవెన్యూ అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాదు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక స్థలాలు గుట్టు చప్పుడు కాకుండా రికార్డు మారుతున్నాయి. ప్రస్తుతం సమీకృత మార్కెట్ కార్యాలయం నిర్మించగా సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి సంగాపూర్ ఐటీసీ వెళ్లే రోడ్డు మార్గంగా ఉన్న భూమిపై కన్ను పడింది. 55 వేల జనాభా, 20 వార్డులతో ఉన్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వ్యాపారంగా, రాజకీయంగా రోజురోజుకు బలపడుతుంది. మున్సిపాలిటీకి ప్రతి ఏటా సుమారు రూ.15 కోట్ల ఆదాయంతో అభివృద్ధి చేస్తున్నప్పటికీ ప్రభుత్వ భూములను గుర్తించి రక్షణ కల్పించడంలో చర్యలు లేవని చెప్పాలి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 25 చోట్ల ప్రభుత్వ స్థలాలను ఉన్నట్లు తెలుస్తుంది. ఇందులో రెండు మూడు చోట్ల నర్సరీలు ఉండగా 8 చోట్ల పార్కులు ఉన్నాయి. మిగతా స్థలాలు ఖాళీగా ఉన్నట్టు ప్రచారం జరుగుతుంది. ఒక్క గజానికి రూ.30 లక్షల వరకు ధర పలుకుతున్న నేపథ్యంలో ఖరీదైన స్థలాలను అధికారులు కాపాడేందుకు శ్రద్ధ చూపడం లేదని విమర్శలు ఉన్నాయి. గతంలోనే ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు దాని కావాల్సిన రక్షణ ప్రహరీ, లేక తీగలతో రక్షణ కల్పించేందుకు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు చేయాలని ప్రతిపాదన చేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వ స్థలాలు బహిరంగంగా ఉండడంతో ఖద్దరు చొక్కాల నాయకులు రోజూ నజరేసి వస్తున్నారు. వెంటనే వాటిని గుర్తించి ప్రహరీ, లేక తీగల ప్రహరీ వేసి ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడుతాం.

-మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి రక్షణ కల్పిస్తాం. మున్సిపల్ పరిధిలో అక్కడక్కడ ఉన్నాయని వెంటనే గుర్తించి రెవెన్యూ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ అభివృద్ధి

- సీనియర్ నేత బెజుగామా వెంకటేశ్వర్లు రావు పంతులు



నవతెలంగాణ- గజ్వేల్

కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బెజుగామా వెంకటేశ్వర్లు రావు పంతులు అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు గజ్వేల్ రూపం ఏమిటో కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని సూచించారు. 2014 తర్వాత గజ్వేల్ రూపం ఏమిటో దేశ చిత్రపటంలో ఉందని చెప్పారు. గజ్వేల్‌ను మున్సిపాలిటీతోపాటు రెవెన్యూ డివిజన్ చేసిన ఘనత గత ప్రభుత్వందే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 20 వార్డుల్లో సిమెంటు రోడ్లు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైల్వే లైన్‌కు వెళ్లే కోట మైసమ్మ రోడ్డు విషయంలో ప్రభుత్వం స్పందించి పూర్తి చేయాలన్నారు. కోట మైసమ్మ రోడ్డు రైల్వే స్టేషన్‌కు అనుసంధానం చేయాలని కేసీఆర్ ఆదేశించినట్లు ఆ పనులు అధికారులు పూర్తి చేయాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రుణమాఫీ విషయం లో రైతులకు సీఎం రేవంత్ రెడ్డి లెంకలు పెడుతున్నారని అన్నారు. భూమిని సాగు చేసే ప్రతి రైతుకు రుణమాఫీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కూడాఏడాదికి మూడు పంటలకు సహాయం అందిస్తామని ఎన్నికల ముందు చెప్పారని, రుణమాఫీలో కౌలు రైతు ముచ్చట లేదని గుర్తు చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు బతుకుదెరువు లేక 2014 వరకు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆ తర్వాత గజ్వేల్ ప్రాంతానికి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారని వారందరికీ రుణమాఫీ ఇవ్వాలి అన్నారు.

రైతు వేదికలలో నేడు రుణమాఫీ సంబరాలు



నవతెలంగాణ-మర్కుక్

రుణమాఫీ డబ్బులు విడుదలైన రోజునే రైతు వేదికల్లో రుణమాఫీ లబ్దిదారులతో సంబరాలు జరుపనున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నేరుగా రుణమాఫీ లాంచనంగా ప్రారంభం, లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతారని మండల వ్యవసాయాదికారి డా.టి.నాగేందర్ రెడ్డి బుధవారం పేర్కొన్నారు. గురువారం రైతు వేదిక మర్కుక్‌లో రైతులు వీడియో కాన్ఫరెన్స్ (దృశ్య శ్రవణ మాధ్యమం) ద్వారా కార్యక్రమాన్ని వీక్షించొచ్చని, రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, బ్యాంకు ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు మీడియా సోదరులు ఈ సంబరాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి రైతులు తప్పనిసరిగా అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

బీసీ సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పయ్యావుల గిరి



నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ బీసీ సాధికారత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సిద్దిపేటకు చెందిన పయ్యావుల గిరి నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని కార్యాలయంలో బీసీ సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాని రామకృష్ణ గౌడ్ నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పయ్యావుల గిరి మాట్లాడుతూ తనని రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు అధ్యక్షులు ప్రతాని రామకృష్ణగౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సాధికారత కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయుల విడుదలలో జాప్యాన్ని నివారించాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ అహమ్మద్, తప్పెట్ల యాదగిరి.
- ఖాళీల వివరాలను తెలియచేయాలని డీఈఓకి వినతి



నవ తెలంగాణ - సిద్దిపేట

బదిలీ అయినా ఎస్జీటీ ఉపాధ్యాయుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ అహమ్మద్, తప్పెట్ల యాదగిరి విద్యాశాఖ అధికారులను కోరారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు మంగళవారం సాయంత్రం జిల్లా విద్యాధికారి ఈ శ్రీనివాసరెడ్డిని కలిసి వివిధ అంశాల పైన వినతిపత్రం అందజేసి, పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, కొన్ని మండలాల్లో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్స్ సమన్వయం లోపం కారణంగా కొంతమంది ఎస్జీటీ ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ విడుదల కాకుండా అదే పాఠశాలలో పనిచేయాల్సి వస్తుందని అన్నారు. బదిలీ అయినా కూడా ప్రయోజనం లేకుండా ఉందని కొంతమంది ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సంబంధిత ఉపాధ్యాయుల, పాఠశాల వివరాలు డీఈఓకు అందజేశామని తెలిపారు. పదోన్నతులు, బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీల వివరాలను తెలియజేయాలని కోరినట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరుకి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వాధ్యక్షులు సి.చంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి, జిల్లా కోశాధికారి ఎం. కృష్ణ, జిల్లా ఎఫ్ డబ్ల్యు ఎఫ్ కన్వీనర్ కే. కనకరాజు, జిల్లా ఆఫీస్ బేరర్లు జి. వెంకట కిరణ్, కే ప్రశాంత్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి. శివలింగం, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. వెంకటేశం, సిహెచ్. రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

కాపాడుకుందాం



అనగనగా ఒక చిన్న గ్రామం ఉండేది. ఆ గ్రామానికి ఆనుకుని దగ్గరలో అడవి ఉండేది. గ్రామంలో రంగయ్య అనే ఒక వ్యక్తి ఉండేవాడు. రంగయ్య రోజు ప్రక్కనున్న అడవిలోకి పోయి చెట్లను కొట్టి ఆ కట్టెలను మూటగట్టుకుని కొద్ది దూరంలోనున్న పెద్దపట్నంలో అమ్మేవాడు. కొంతకాలానికి ఆ అడవిలోని చెట్లు తగ్గిపోయాయి. అడవి జంతువులు పంటపొలాలలోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. ఊర్లోకి వచ్చి ఊరి ప్రజలను భయపెడుతున్నాయి. ఇదిలా ఉండగా ఒకరోజు రంగయ్య గొడ్డలిపట్టుకుని ఇంట్లోంచి బయటపడి నడచుకుంటూ అడవికి బయలుదేరాడు. దారిలో ఆరవతరగతి చదువుతున్న హర్ష ఎదురుపడ్డాడు. "తాతా! ఎటు పోతున్నావు?" అని అడిగాడు. దానికి రంగయ్య "అడివికి పోతున్నా బిడ్డా! కట్టెలు కొట్టుకుని పట్నం బోయి అమ్ముకొస్తా!" అని జవాబి చ్చాడు. అప్పుడు హర్ష "ఓ పిచ్చితాతా! అందరు నీలాగా అడవిలోని చెట్లను కొట్టేయడం వల్లనే అడవిలోని జంతువులు ఊర్లోకి వస్తున్నాయి. చెట్లు కార్బన్ డై ఆక్సయిడ్ పీల్చుకుని మనకు అవసరమైన ఆక్సిజన్ ఇస్తాయని మా సైన్స్ సార్ చెప్పిండు. మంచిగాలి కావాలంటే చెట్లు ఉండాలి తాతా!" అన్నాడు. దానికి రంగయ్య "బిడ్డా! బడికిపోయి మంచి ముచ్చట్లు నేర్చుకున్నవ్! ఇప్పటి నుంచి నేను చెట్లను కొట్టేయ! ఇంకోళ్ళను కొట్టనియ్య! అవసరానికి కొట్టినా కొత్తగా ఒకటికి రెండు చెట్లను పెంచుతా!" అని హర్షను దగ్గరకు తీసుకున్నాడు.

ముస్త్యాల దినకర్,
ఆరవ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
నరసాయపల్లి గ్రామం, మద్దూర్ మండలం,
సిద్ధిపేట జిల్లా.

అక్రమంగా ఇసుక డంపింగ్ పై అధికారులు చర్యలు తీసుకోవాలి

- పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కెఎస్. అనిల్



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలో జనవాసంలో కొందరు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక డంపింగ్ చేస్తున్నారని, వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కెఎస్.అనిల్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపల్ అధికారులు కూడా పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీలో అడ్వకేట్ కాన్ఫరెన్స్ హాల్ దగ్గర ట్రాఫిక్ నియమాలకి విరుద్ధంగా లారీలతో తప్పుడు మార్గంలో ఇసుక తరలించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా మున్సిపల్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదనా రు.కాలనిలో చిన్న పిల్లలు ఎక్కువ ఉండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశమున్నదనీ తెలిపారు. పలుమార్లు ప్రమాదాలు కూడా జరిగినట్లు కాలని వసూలు చెప్తున్నారని, తక్షణమే కారకులపైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పాండురంగలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండల పరిధిలోని భావానందపూర్‌లో గల పాండురంగ ఆశ్రమంలో 93వ ఆశాడి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు సాధమంటపంలో వేదికపై దీప ప్రజ్వలనతో ప్రారంభించారు.చూట్టూ ప్రక్కల జిల్లా, గ్రామాలలో ప్రజలు ఆధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉపాద్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అప్పాల సత్యనారాయణ శర్మ, అప్పాల విఠల శర్మ, అప్పాల రసరాజ శర్మ, అప్పాల మాధవ శర్మ రాధపతి శర్మ, శివ కుమార్ శర్మ, బావానంద శర్మ, శ్రీధర్ శర్మ,కార్తీక్ శర్మ,శశి పంతులు, భక్తులు తదితరులున్నారు.

రేబర్తి పెద్దమ్మ ఆలయంలో చోరీ



నవ తెలంగాణ-మద్దూరు

మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలోని ముదిరాజ్ సంఘం కులస్తులు నిర్మించుకున్న పెద్దమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చోరీ జరిగిన పెద్దమ్మ ఆలయాన్ని చేర్యాల సీఐ ఎల్. శ్రీను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఆలయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి నాలుగు గ్రాముల బంగారం, 10 గ్రాముల వెండి చోరీ చేసినట్లు ఆలయ పూజారి నీరటి మంజుల, ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా తొలి ఏకాదశి పర్వదినం



నవ తెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య ఘనంగా చేసుకున్నారు. ఉదయాన్నే ఇళ్లల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఆలయాల సందర్శన అభిషేకాలు అర్చనలు సందడి సందడిగా కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ప్రజలు నిర్వహించారు. జిన్నారం మండల పరిధిలోని మాదారం, శివనగర్, కొడకంచి ఉట్ల మంగపేట జంగంపేట లక్ష్మీపతి గూడెం వావిలాల చౌదరి గూడెం నల్తూర్ మంత్రి కుంట కొర్లకుంట దూబగుంట గడ్డపోతారం, చెట్ల పోతారం కిష్టయ్య పల్లి కాజిపల్లి సోలక్పల్లి రాళ్లకత్వ అండూర్ మీజాజి గూడెం ఇమామ్ నగర్, నర్రిగూడ రాళ్లకత్వ తాండ గ్రామాల్లో ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు పిల్లలు వృద్ధులు ఇంటిల్లిపాది ఆయా గ్రామాల్లో ఆనందంగా పండుగను చేసుకున్నారు.


పాండురంగ స్వామి దేవాలయంలో పూజలు



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గంలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని స్థానిక పాండురంగ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో ఉన్న దేవాలయాల్లో ప్రజలు ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు చేపట్టారు. పాండురంగ స్వామి దేవాలయంలో 40 ఏళ్ల తర్వాత స్పర్శదర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు ఉద్ధవ భవ మహారాజ్, గణేష్ పంతులు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఆకుల రాంబాబు, 12వ వార్డ్ కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు, లయన్స్ క్లబ్ కోశాధికారి జి. సంతోష్, ప్రెస్ క్లబ్ నాయకులు రాజేష్, కుమార్, యువజన నాయకులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహరం పండుగ వేడుకలు



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండలంలోని గ్రామాల ప్రజలు కుల, మతాలకు అతీతంగా పీర్ల పండగ(మొహర్రం)ను బుధవారం ఘనంగా జరుపుకున్నారు.గ్రామాలలో పలు వీధులగుండా డప్పు చప్పుళ్లతో పీర్లను ఊరేగించారు.ఈ సందర్భంగా పలువురు దర్శించుకుని దట్టీలు కట్టి, ఊది బెల్లం చదివించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం పీర్ల మసీదు వద్ద ఆల్వా చుట్టు పీర్లు ఊరేగిస్తూ ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ.. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా పీర్ల పండుగ ఉత్సాహాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలోఅయా గ్రామాల ప్రజలు, గ్రామస్థులు, యువకులు, మహిళలు, పిల్లలు, పలువురు పాల్గొన్నారు.



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మొహర్రం పండుగ వేడుకలు నిర్వహించారు. హిందూ, ముస్లింలు కలిసి చేసుకునే పీర్ల పండుగ అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. మండలంలోని నంగునూరు, హుస్సేన్ నగర్, సిద్దన్నపేట, గట్లమల్యాల, మైసంపల్లి, ఖాత, రాంపూర్, మగ్దుంపూర్, పాలమాకుల తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొహర్రం పండుగ బుధవారంతో ముగుసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పీర్లను గ్రామాల్లో ఊరేగింపుగా తీసుక వెళ్ళారు. మాజీ ప్రజాప్రతినిధులు, కమిటీ నిర్వాహకులు పండుగలో పాల్గొన్నారు.

రుణమాఫీ ఏకకాలంలో చేయాలి

బీజేపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి



నవ తెలంగాణ- గజ్వేల్

రైతు రుణమాఫీ ఏకకాలంలో చేయాలని బీజేపీ సిద్దిపేట జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ నాయకులు మాదాటి జస్వంత్ రెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, ప్రమాణాలను మర్చిపోయి ఇప్పుడు దశలవారీగా రైతు రుణమాఫీ చేస్తామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఓట్ల కోసం కన్నీరు పెట్టుకున్న కాంగ్రెస్ నాయకులు అధికారం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేసినట్లు విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేసేందుకు అనేక లింకులు పెడుతున్నారని విమర్శించారు. రేషన్ కార్డు, పట్టా పాస్ పుస్తకం అంటూ రుణమాఫీ చేయకుండా అడ్డుకట్ట వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తుందని అయినా ఆరు గ్యారెంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల మీద, రైతుల మీద కపట ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు బండారు మహేష్, జనార్ధన్, వెంకటేష్, కుమార్ గౌడ్, ప్రసాద్, సందీప్, వెంకట్ రెడ్డి, స్వామి, నవీన్, సాయి, స్వామి తదితరులు పాల్గొన్నారు.